# దొంగలున్నారు జాగ్రత్త!

## అరిగె రామారావు

గాడిద వోండ్రించును.

గాడిదలు కష్టంలో అయినా, సుఖంలో అయినా, సఖ్యానికయినా, కయ్యానికైనా, ఆకలికైనా, ఆనందానికైనా, దేనికైనా, ఎప్పుడైనా వోండ్రిస్తాయే, మనుషుల్లాగా కమ్మగా, తియ్యగా, తిట్టుగా, బెట్టుగా, సూటీ పోటీగా, ఘాటుగా, ధాటీగా, ప్రేమగా, చల్లగా బయటొకటీ, మనస్సులో ఒకటీగా మాట్లాడలేవు.

అలాగే, మనుషుల్లో అడ్డ గాడిదలు సహితం గాడిదల్లాగా వోండ్రపెట్టలేరు.

అందుకే, ఏనాదోళ్ళ గజ్జికుక్క వుత్తపున్నేనికి తన మీద మీద కొచ్చి అరుస్తోన్నా, కరుస్తోన్నా లంబాడోళ్ళ గాడిద ఏం వెయ్యలేక వూరికే వోండ్రుపెట్టుతూంది...

ఎడ తెగని ఆ గాడిద వోండ్రింపుకు మట్టయ్యకు మెలకువ వచ్చింది.

'ఓర్నీయమ్మ, యిదెక్కడి గాడిదరా ముదనష్టపు గాడిదా!' అని తిట్టుకుంటూ లేచి కూర్చున్నాడు.

గుడిశ కడ్డంగా కట్టిన గోనె పట్టా చిరుగుల్లోంచి బయట మసకమసగ్గా కనిపిస్తోంది.

పట్టాని చేత్తో వత్తిగిలించి బయటికి చూశాడు.

బయట తెల తెల వారుతూంది. ఆకాశం వెల వెల బారుతూంది.

'ఓర్నీయమ్మ, అప్పుడే తెల్లారిపోయిందే!' అనుకుంటూ కిందేసి పడుకున్న పెద్ద గోనె సంచిని దులిపి భుజానేసుకుని గుడిశ బయటికొచ్చాడు.

తన ప్రక్క గుడిశ లోంచి వూరికే మూల్గు వినిపిస్తోంది. ఆ గుడిశలో వుంటున్న ఏశూబుకు రెండు రోజుల్నుంచి జ్వరం. పన్లోకి పోడం లేదు.

ఏశూబు కూడా తనలాగే వంటరిగాడు. ఏక్ నిరంజన్. వోపికున్న రోజు పన్లోకి వెళతాడు. వున్న రోజు తింటాడు. లేని రోజున డొక్కలోకి కాళ్ళు ముడ్చుకుని గుడిశలో పడుకుంటాడు.

'వంటో యిప్పుడెట్టా వుంది ఏశూబన్నా!' ప్రక్క గుడిశలోకి తొంగి చూస్తూ పలకరించాడు.

'అట్టాగే వుంది మట్టయ్యా!' మూల్గుతూ అన్నాడు ఏశూబు.

'లేసి కొత్త మొకం కడుక్కో! నేనెళ్ళి టీ నీళ్ళు తీసికొస్తా!' అని చెప్పి లంబాడోళ్ళ గుడిశలు మీదగా తుమ్మ తోపు దాటి రోడ్డు మీదకొచ్చాడు.

రైలు గేటు ప్రక్కనున్న నర్సింగ్ టీ దుకాణం బయట నిలబడి పని పాటలకు పోయే జనం టీలు తాగుతున్నారు.

బోరింగ్ పంపు దగ్గర కెళ్ళి నీళ్ళు కొట్టుకొని పుక్కిలించి-వూసి మొగం కడుక్కున్నాడు.

జేబులో అడుగూ బొడుగూ వున్న చిల్లర పైసలు బయటికి తీసి లెక్కపెట్టాడు. మొత్తం రూపాయి పైసలున్నాయి. రెండు టీలకు సరిపోయే డబ్బులు. తానొక టీ తాగి, ఏశూబుకు ఒక టీ తీసుకెళ్లాడు. వేడి వేడి టీని ఆబగా తాగుతూ, నిజంగా నీవు దేవుడి వయ్యా మట్టయ్యా! అన్నాడు ఏశూబు. దిక్కు లేనోడికి దేవుడే దిక్కని ఎప్పట్నో పాతకాలపు మాట! అది ఆ కాలపు దేవుడు. ఈ కాలపు దేవుడు గొప్పోళ్ళకే దేవుడు! తనకు పూజలు వ్రతాలు చేసే వాళ్ళను, గుడులు గోపురాలూ కట్టించే వాళ్ళను మాత్రమే చల్లగా చూస్తాడు. తన వరాలన్నీ ఆళ్ళకే ఇస్తాడు! తమలాంటో ళ్ళకు ఆయనిచ్చేది అగ్గిలాంటి ఆకలీ, కటిక దరిద్రమూ, కన్నీళ్ళూ మాత్రమే!... మట్టయ్య విరక్తిగా నవ్వుకున్నాడు. కాబట్టి దిక్కు లేనోడికి మరో దిక్కు లేనోడే దిక్కు! ఇది ఈ కాలపు మాట!

'ఒక బీడీ ముక్కుంటే ఇయ్యి మట్టయ్యా!' అడగ లేక అడిగాడు ఏశూబు.

మట్టయ్య జేబులు తడుముకుని చూశాడు. మధ్యకు విరిగిన బీడీ ఒకటి, మంచిగా వున్న బీడీ ఒకటీ వున్నాయి.

మంచి బీడీని ఏశూబుకిచ్చి, విరిగిపోయిన బీడీని తాను వెలిగించుకున్నాడు.

ఖాళీ టీ గ్లాసుని యిచ్చేసి మట్టయ్య రోడ్డంట నడుస్తోన్నాడు. మిగిలిన ఆఖరి రూపాయితో తానొక టీ తాగి, ప్రక్క గుడిశలోని జ్వరం మనిషికి మరో టీ తాగించాడు. ఉన్న రెండు బీడీల్లో విరిగిపోయిన బీడీని తాను తీసికుని, మంచి బీటీని ఏశూబుకిచ్చాడు.

ఇప్పుడతని దగ్గర చిల్లి గవ్వ గూడా లేదు! త్రాగటానికి బీడీ ముక్క కూడా లేదు.

ఇప్పుడతని స్థిరాస్థీ, చరాస్థీ - భుజానేసుకున్న పాత గోనే సంచీ, వంటి మీద మాసిక లేసి మాసిపోయిన అడ్డ పంచా, బన్నీనూ, నెత్తి మీద అడ్డదిడ్డంగా పెరిగిన జుట్టూనూ! దట్సాల్ - వెరీ ఫ్రీడమ్ సిటిజన్ ఆఫ్ ఇండిపెండెంట్ ఇండియా! అతనికి ఆదాయానికి మించిన ఆస్తుల్లేవు - గనుక ఏసిబి వాళ్ళ వలల భయం లేదు. అతనికి బినామీ పేర్లతో ఆస్థిపాస్తుల్లేవు. కనుక ఇన్ కంటాక్స్ వాళ్ళ రైడింగ్‌ల బాధ లేదు. బ్లాక్ మనీ బెడద లేదు. విజిలెన్స్ వాళ్ళ వేధింపు లేదు. తన సీటు పోతుందనీ లేదు, ఓట్లు రావనీ లేదు!

అందుకనే నిశ్చింతగా, నిర్భీతిగా, స్వేచ్ఛగా ఆ నేషనల్ హైవే వెంట నడుచుకుంటూ పోతున్నాడు.



అప్పుడు టైం ఆరు గంటలు కావస్తోంది. అప్పుడు ఉషోదయ కాంతి రేఖలు మెల్ల మెల్లగా విచ్చుకుంటు న్నాయి. ఉషః కాంతి మట్టయ్య లాంటి మురికి మనిషి కూడా నీరాజనాలు పట్టుతూంటె, ఉషః పవనాలు వింజామరలు వీస్తున్నాయి. సూర్యకాంతికి, చల్ల గాలికి గొప్పా బీదా అనే తారతమ్యాల్లేవు. రీజినల్ ఫీలింగ్ లేదు. కేస్ట్ ఫీలింగ్ అంతకంటే లేదు. పార్టీ ఫీలింగ్ లేదు. అందరూ సమానం. అందర్నీ అలరి స్తాయి. అందర్నీ సాదరంగా పలకరిస్తాయి.

ఆ జాతీయ రహదారి మీద మట్టయ్య అలా భుజాన పాత గోనె సంచేసుకుని నడుచుకుంటూ పోతూంటే, ఆ రోడ్డు మీద అదే సమయంలో మార్నింగ్ వాక్ చేస్తున్న వాళ్ళు అతనికి తారసపడుతున్నారు.

అదిగో, మల్లె పువ్వు లాంటి లాల్చీ, పైజామా, టీ షర్టేసు కొని దబ్బ పండు ఛాయలో వున్న ఆ పెద్ద మనిషి ఆఫీసులో తన వెయ్యి తడపందే ఆఫీసు బల్ల మీది ఏ ఫైలూ ఎత్తడు; యింటి దగ్గర నేతి వెంట వెయ్యి కారందే భోజనం బల్ల దగ్గర ముద్ద ఎత్తడు. ముద్ద ముద్దకీ నెయ్యి కారంగా తిని తినీ పాపం ఆయనకు 'కొలెస్ట్రాల్' పెరిగిపోయింది. ఒకసారి ఆఫీసులో పడిపో యాడు. అందుకే వైద్యుల సలహా మేరకు రోజూ మార్నింగ్ వాక్ చేస్తున్నాడు.

ఇదిగో, చిన్న బొజ్జేసుకుని దొర్లు పుచ్చ కాయలాగా గున గున నడుస్తోన్న ఈ ఆసామి రాత్రుళ్ళు రతి కేళిలో పూరికే ఆయాస పడిపోతూ, ప్రతిసారి భార్య ముందు సిగ్గుతో తల వంచుకోవాల్సివస్తోంది; అందుకే ఆ బొజ్జని కాస్తా కరిగించుకుందామని మార్నింగ్ వాక్‌కు వచ్చాడు.

అదిగదిగో, ఆ బట్టతలాయన ఆదాయానికి మించిన ఆస్తులు అవినీతిమార్గాన సంపాదించి, ఈ మధ్య ఏసిబి వాళ్ళ దాడుల వార్తలు రోజూ వింటూ, చదువుతూ, మాటిమాటికీ పూరికే భయపడిపోతూ, బిపిని పెంచు కుని, దాన్ని తగ్గించుకోవడానికి రోజూ మార్నింగ్ వాక్‌కి వస్తోన్నాడు.

ఇదే సమయంలో అదే రోడ్డుమీద నడుస్తోన్న మట్టయ్య మాత్రం కొలెస్ట్రాల్ తగ్గించుకోవడానికో, బొజ్జ కరిగించుకోటానికో, బి.పి.ని నార్మల్‌కి తెచ్చు కోవడానికో మార్నింగ్ వాక్ చెయ్యటంలేదు.

మరి దేనికి నడుస్తోన్నట్లు?

పొట్ట కూటికొరకు నడుస్తోన్నాడు.

బతుకుతెరువు కోసం నడుస్తోన్నాడు. రోడ్డుమీద చెత్తాచెదారం పోగుచేసుకుందానికి నడుస్తోన్నాడు. ఆ చెత్తని అమ్ముకొని రెండు రూపాయిలు సంపాదించి దాంతో కడుపుకింత తిందామని నడుస్తోన్నాడు.

అదిగో, అతనికి రోడ్డు పక్కన ఒక చెత్తకుండీ కనిపించింది. దాన్ని చూడగానే, ఒక పెద్ద పెన్నిధిని చూచి

నల్లు, పంద మతాబులు పక్కసారి వెలిగినట్లు, అతడి కళ్ళల్లో ఆనందపు మొగ్గలు విమ్మాయి.

పకపకా దానిదగ్గర కెళ్ళాడు.

దాంట్లో చెయ్యిపెట్టి గబగబా వెతికాడు, దొరికిన చిత్తుకాగితాలను, పనికిరాని అట్టముక్కల్ని, పాలడబ్బాల్ని భుజంమీది గోనె సంచిలోకి వేసుకున్నాడు.

అక్కడ్నుంచి ప్రక్క కాలనీలోకి మళ్ళాడు.

అలా గోడల ప్రక్కా, మురికి కాలవల దగ్గరా, చెత్తకుండీల్లో, చెత్తాచెదారంలో కెలుక్కొని, యేరుకొని, వెతుక్కొని తనక్కావల్సిన పాతకాగితాలూ, పాత డబ్బాలు, వాడేసిన బ్రష్షులూ, అట్టముక్కలూ, సీసాలను గోనె సంచిలోకి వేసుకుంటున్నాడు.

ఆ చెత్తాచెదారాన్ని చేత్తో కెలుకుతూంటే భరించలేని దుర్గంధం గుప్పున లేస్తోంది. ఆ చెత్తలో వెతుకుతున్నప్పుడు పిల్లల పీతిగుడ్డలూ, ఆడవాళ్ళ 'అంటు' గుడ్డలూ, మొగవాళ్ళు వాడేసిన నిరోధులూ, చీమూ నెత్తురూ తుడిచేసిన బేండేజి గుడ్డలూ తగులుతున్నాయి.

మట్టయ్య అంటరాని వస్తువుల్ని తాకుతున్నందుకు అసహ్యించుకోవటంలేదు. తన బ్రతుకిలా అయిపోయిందేమని బాధపడడం లేదు. ఆ దుర్గంధానికి ముక్కు మూసుకోవటం లేదు, ఎందుకంటే తెల్లారి లేస్తే ఆ మళ్ళలో, ఆ కంపులో, ఆ చెత్తలో, ఆ చెదారంలో, ఆ మలినంలో వెతుక్కోవడమే తన వృత్తి, అదే తన భుక్తి ఇదే తన జీవనం! హేయమైన నీతిగా పొట్టపోసుకునే దారి అది!

మట్టయ్యలా కాగితాలుఏరుకుంటూ ఏరుకుంటూ ఆ కాలనీలోకల్లా పోష్ లొకాలిటీలోకి వచ్చాడు. అక్కడ వున్నవన్నీ పెద్దపెద్ద బిల్డింగ్‌లు. రెండంతస్థులు, మూడంతస్థుల భవనాలు. అందులో వుంటున్నవాళ్ళందరూ పెద్దపెద్ద ఆఫీసర్లూ, బడాబడా సేట్లూ, అర్థబలం,అంగబలమున్న వాళ్ళు. ఆ భవనాలకు దిష్టిబొమ్మల్లాగా వాటి ప్రక్కనే చిన్నచిన్న గుడిశలుకూడా వున్నాయి. వాటిల్లో బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్‌లో లేబర్‌గా పన్జేసే వుప్పుళోళ్లూ, లంబాడోళ్లూ తల దాచుకుంటున్నారు.

అక్కడికి రాగానే ఆ ఏరియాకుక్కలన్నీమట్టయ్యను ముట్టేశాయి. అవన్నీ ఆ గుడిశలవాళ్ళ కుక్కలు, బజార్లోని వూరకుక్కలున్నూ!

అతని వేషం, భుజానవున్న పెద్ద సంచీ, ఆ ఎంపిరి జుట్టూ, ఆ బవిరిగడ్డమూ, ఆ మురికి గుడ్డలూ, ఆ వాలకం, అదీ మాడగానే ఆ కుక్కలకు అతడు యిళ్ళకు కన్నాలేసే దొంగలాగానో, పేటలు దోచే బందిపోటులాగానో కనిపించివుంటాడు. అందుకే అతడ్ని నడిరోడ్డుమీద నిలేసి భయంకరంగా మొరగసాగాయి. మీద మీదకు దూకసాగాయి.

మట్టయ్య బిత్తరపోయి, బిక్కమొగమేసుకొని మాస్తుండిపోయాడు. వాట్ని చేత్తో అదిలించినాపోవటం లేదు. వాటిల్లో ఆడకుక్కలు, మొగకుక్కలూ, మసరి కుక్కలూ, పదుచుకుక్కలూ, గజ్జికుక్కలూ, కుంటి కుక్కలూ కూడా వున్నాయి.

ఒక కుక్క భౌభౌకు,మరో కుక్క భౌభౌకలిపే వంత మొరగటం కుక్కజాతి సంఘీభావం! రోడ్డు కుక్కల అరుపులకు బిల్డింగ్స్‌లో వున్న పెంపుడు కుక్కలు - జాతి కుక్కలూ, సీమ కుక్కలూ, క్రాస్ బీడ్ కుక్కలూ, బొచ్చుకుక్కలూ, బుజ్జి కుక్కలూ, 'ఇల్లాలి ముద్దుల్లు' అందమైన కుక్కలూ బాల్కనీలోంచీ, పోర్టికోల్లోంచీ, బెడ్‌రూమ్స్ కిటికీల్లోంచీ, పట్టు పరుపుల్లోంచీ, అమ్మాయి గార్ల రగ్గుల్లోంచి, అమ్మగార్ల వంకల్లోంచీ, అయ్యగార్ల భుజాలమీద నుంచీ మోరలెత్తి 'భౌభౌ' మనీ, కయ్‌కయ్ అని 'కుయ్ కుయ్' అని అరుస్తోన్నాయ్...

తనని మాచి, నడిబజార్న నిలేసి ఈ కుక్కలన్నీ ఒక్కసారి ఎందుకిలా అరుస్తోన్నాయో తాను చేసిన నేరమేంటో, రోడ్డున పోయే ఇందర్ని వదిలేసి తననే ఎందుకు పట్టుకున్నాయో అర్థంకాక బిత్తరపోయి, బిక్క వచ్చిపోయి మాస్తూ నిలబడిపోయాడు. తన నికృష్టపు బ్రతుకు ఈ కుంటి కుక్కలకన్నా అలుసయిపోయిందా అని అనుకుంటూ ఒక కర్రపుల్లతో వాట్ని అదిలిస్తూ, బెదిరిస్తూ, కాగితాలు ఏరుకోకుండానే ఆ సందులోంచి ఎలాగో బయటపడ్డాడు.

అయినా రెండుమూడు కుక్కలువదలకుండా అతడి వెంటపడి తరముతూనే వున్నాయి.

అంతలో ఆ సందులోంచి సూటూ బూటూ వేసుకున్న ఒక వ్యక్తి చేత్తో బ్రీఫ్‌కేసు పట్టుకొని వచ్చాడు. సందు మొదట్లో నిలబడివున్న ఆటో ఎక్కాడు. ఆటో స్పీడుగా ఆ కాలనీలోంచి వెళ్ళిపోయింది.

ఆటో అలు వెళ్ళిందో లేదో ఆ సందులోంచి ఒకాయన హడావుడిగా పరిగెట్టుకుంటూ వచ్చాడు.

'బ్రీఫ్‌కేసు తీసుకొని ఇటెవరన్నా వచ్చారా?' అని పాన్ షాపు దగ్గర కంగారుగా వాకూబు చేస్తోన్నాడు. ఆటో ఎక్కి వెళ్ళిపోయాడని ఒకతను చెప్పాడు. ఓరి దొంగ రాస్కెల్! డ్రాయింగురూంలో వున్న యాక్షన్- వన్, రిష్టువాచి, టేబుల్‌క్లాక్ అన్నీ బ్రీఫ్ కేసులో పెట్టుకొని వెళ్ళిపోయాడు అని ఆయన మొత్తుకుంటున్నాడు.

తన వెనకపడి ఇంకా మొరుగుతున్న కుక్కల్ని, 'దొంగముండల్లారా! అదిగో అట్టాంటి అసలు దొంగల్ని పట్టండే! చెత్తా చెదారం ఏరుకునే జేవార్నునాకొడుకుని నాకాడ ఏం వుంటుందే!' అని గొణుగుతూ చేతికందిన రాయిని తీసుకొని రోషంగా, వుక్రోషంగా వాటిమీదకు విసిరేశాడు. ●



